క్లుప్తంగా

బ్రహ్మోత్సవ ఏర్పాట్లు

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీ సత్య నారాయణస్వామి ఆలయంలో ఈ నెల 30నుంచి ఫిబ్రవరి 6వరకు స్వామివారి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. బ్రహ్మోత్సవ ఏర్పాట్లలో భాగంగా ఆదివారం ఆలయానికి రంగులు వేయడం ప్రారంభించారు.

'అవినీతి పాలనకు చరమగీతం పాడుదాం'

జన్నారం: రాష్ట్రంలో పెరుగుతున్న అవినీతి పాలనకు చరమగీతం పాడాలని మాజీ ఎంపీ, బీజేపీ నేత రాథోడ్ రమేశ్ అన్నారు. మండలంలోని మురిమడుగు, ఇందన్‌పల్లి గ్రామాల్లో 'ప్రజాగోస-బీజేపీ భరోసా' కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఇంటింటికీ తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అవినీతి, అక్రమాలను, ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రతి గడపకూ వెళ్లి పలుకరిస్తూ రానున్న ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తేవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు బద్రినాయక్, బీజేపీ నాయకులు ఉట్కూరి శ్రీనివాస్‌రెడ్డి, మహేశ్, వంగపల్లి సురేశ్, నల్లపు కృష్ణ, మల్లేశ్, రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దండేపల్లి: లక్సెట్టిపేట, జన్నారం, దండేపల్లి మండలాల్లో సోమవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు లక్సెట్టిపేట విద్యుత్ ఏడీఈ ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 33కేవీ కొత్తలైన్ ఏర్పాటులో భాగంగా సరఫరా నిలిపి వేయనున్నట్లు విద్యుత్ వినియోగ దారులు గమనించాలన్నారు.

'ఓపెన్' తరగతులకు హాజరవ్వాలి

దండేపల్లి: సెలవు రోజుల్లో నిర్వహించే ఓపెన్ పది తరగతులకు అభ్యాసకులు తప్పక హాజరవ్వాలని దండేపల్లి ఓపెన్‌స్కూల్ సహాయ కో ఆర్డినేటర్ రాజేశ్వర్‌రావు అన్నారు. మధ్యలో చదువు మానేసిన వారికి ఓపెన్ స్కూల్ ఓ వరం లాంటిదని, విద్యాసంవత్సరంలో నిర్వహించే 30తరగతులకు అభ్యాసకులు హాజరవ్వాలని సూచించారు.

వార్డులో పర్యటించి సమస్యలు ఆలకించి..

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని 1వ వార్డు రాజీవ్‌నగర్‌లో ఆదివారం ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పర్యటించి, ప్రజలను సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికీ సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరిస్తూనే, వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. వార్డును అభివృద్ధి పర్చేందుకు అవసరమైన పనులను గుర్తించి, అందుకు సరిపడా నిధులను కేటాయిస్తామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వార్డు కౌన్సిలర్ బుద్ధార్థి సత్తమ్మ, పీఏసీఎస్ చైర్మన్ సందెల వెంకటేశ్, బుద్ధార్థి రాంచందర్, నాయకులు పాల్గొన్నారు.

బంద్ సంపూర్ణం

లక్సెట్టిపేట: ఐక్యవ్యాపార సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన దుకాణాల బంద్ సంపూర్ణంగా కొనసాగింది. మూకుమ్మడిగా సాగిన బంద్‌లో వ్యాపారస్తులు పాల్గొని దుకాణాలను బంద్ చేశారు. వ్యాపారస్తులపై దాడులను నిరసిస్తూ ఇక ముందు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. స్థానిక పోలీసులు ఎలాంటి సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా బందోబస్తు నిర్వహించారు.

బీఆర్ఎస్ సోషల్ మీడియా ఆత్మీయ సమ్మేళనం

భీమారం: మండలంలోని అంకుసాపూర్‌లో ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ఆదేశాల మేరకు గ్రామాల పరిధిలో ఆదివారం బీఆర్ఎస్ సోషల్ మీడియా ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఇందులో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్ మాట్లాడారు. కార్యకర్తలంతా పార్టీ బలోపేతానికి కృషి చేసి, ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర వికాస సమితి ఉపాధ్యక్షుడు విజయానంద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుపై అవగాహన

బేల: మండలంలోని ఆయా గ్రామాల రైతులకు ఆదివారం ఖమ్మం జిల్లా అశ్వరావుపేట దుమంగూడ మండలం మల్కర్‌లో రాష్ట్ర ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పాం సాగుపై అవగాహన కల్పించారు. చీడ పీడలు, ఎరువుల ఖర్చు, సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. ఏటా దిగుబడితో వచ్చే ఆదాయం, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి కమిటీ సభ్యుడు ఠాక్రే మంగేష్, బీఆర్ఎస్ నాయకులు సతీష్ పవార్, గేడాం మనోజ్, చౌహాన్ సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

'తొలిమెట్టు'తో సత్ఫలితాలు

- చదవడం, రాయడంలో విద్యార్థులు మెరుగు
- తోడ్పడుతున్న టీఎల్ఎం


బోధనను పరిశీలిస్తున్న హెచ్ఎం రమేశ్

కెరమెరి: రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన తొలిమెట్టు కార్యక్రమంతో పాఠశాలలు సత్ఫలితాలు సాధిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిరోజు తొలిమెట్టు కార్యక్రమాలు జోరుగా సాగుతుండడంతో విద్యార్థులు నైపుణ్యాలు సాధించగలుగుతున్నారు. మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో మూడు స్కూల్ కాంప్లెక్స్‌లు ఉండగా లోకల్‌బాడీ పాఠశాలలు 56 ఉన్నాయి. వాటిలో ఉన్నత పాఠశాలలు 3, ప్రాథమికోన్నత పాఠశాలలు 5, ప్రాథమిక పాఠశాలలు 48 ఉన్నాయి. వీటిల్లో మొత్తం 3,213 మంది విద్యనభ్యసిస్తున్నారు.

తనిఖీలు, పర్యవేక్షణలు..

రాష్ట్ర, జిల్లాస్థాయి అధికారుల నుంచి మండలస్థాయి అధికారుల వరకు ఎప్పటికప్పుడు పర్యవేక్షణలు కొనసాగుతుండడంతో ఉపాధ్యాయులు అలర్ట్ అవుతున్నారు. అధికారులు ఆకస్మిక తనిఖీలతో హడలెత్తిస్తున్నారు. వచ్చిన ప్రతీ అధికారి విద్యార్థులతో పుస్తకాలు చదివించడంతో పాటు చతుర్విధ ప్రక్రియలు చేయిస్తున్నారు. మండల, క్లస్టర్ నోడల్ అధికారులు తొలిమెట్టు కార్యక్రమాలను నిత్యం పర్యవేక్షిస్తున్నారు. తరగతి బోధనను పరిశీలిస్తూ సలహాలు, సూచనలు అందిస్తున్నారు. ఉపాధ్యాయులు సైతం ముందస్తుగానే సిద్ధమై పాఠశాలలకు వచ్చి బోధన చేస్తున్నారు. తరగతులు, పాఠ్యాంశాల వారీగా బోధన చేస్తుండడంతో పాఠశాలల్లో విద్యాబోధన మెరుగుపడుతోంది.

టీఎల్ఎంతో ఉపయోగం

టీఎల్ఎం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతోంది. టీఎల్ఎం బోధనలతో విద్యార్థులు మెదడుకు పదును పెడుతున్నారు. నూతన, వినూత్న విధానాలతో, సృజనాత్మకతతో టీఎల్ఎంలు తయారుచేసి విద్యార్థులకు వివరిస్తున్నారు. దీంతో విద్యార్థులు ఆయా క్రియల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

మరింత మెరుగుపడాలి



ప్రస్తుతం పాఠశాలలు అనేక అంశాల్లో మెరుగుపడుతున్నాయి. విద్యార్థులు పదాలు చదవగలుగుతున్నారు. చతుర్విధ ప్రక్రియలు చేయగలుగుతున్నారు. బడులు మరింత మెరుగుపడాలి.

– ఆడే ప్రకాశ్, ఎంఈవో, కెరమెరి

బస్సుకు మోక్షం ఎప్పుడో..?

- ప్రైవేట్ వాహనాలే దిక్కు
- అధిక చార్జీలు వసూలు చేస్తున్న వాహనదారులు
- ఇబ్బందులు పడుతున్న మండలవాసులు


గతంలో నడిచిన ఆర్టీసీ బస్సు (ఫైల్)

దహెగాం: రోడ్డు సౌకర్యం ఉన్న ప్రతీ గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీసులు నడిపిస్తామని ఆర్టీసీ అధికారులు చెబుతున్న మాటలు నీటిమూటలుగా మారుతున్నాయి. దహెగాం మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో మండలవాసులు ఇబ్బందులు పడుతున్నారు. దహెగాం మండలం ఆసిఫాబాద్ ఆర్టీసీ క్లస్టర్‌లోకి వస్తుంది. మంచిర్యాల డిపో ఆర్టీసీ బస్సులు మండలానికి బెల్లంపల్లి మీదుగా వస్తున్నా ఆసిఫాబాద్ డిపో బస్సు సర్వీసులు మాత్రం రావడం లేదు. దీంతో వివిధ అవసరాల నిమిత్తం మండలం నుంచి కాగజ్‌నగర్ పట్టణానికి వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్సులు లేకపోవడంతో అధిక చార్జీలు వెచ్చించి ప్రైవేట్ ఆటోల్లో వెళ్లాల్సి వస్తుందని మండల వాసులు వాపోతున్నారు. ఈనెల మొదటి వారంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు దహెగాంకు ఆర్టీసీ బస్సులు నడిపించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా కేవలం ఒకరోజు మాత్రమే బస్సు నడిపించి నిలిపివేశారు. జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆసిఫాబాద్ డిపో నుంచి కాగజ్‌నగర్ మీదుగా దహెగాంకు ఆర్టీసీ బస్సు సర్వీసులు నిత్యం నడిపించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి


దుప్పట్లు పంపిణీ చేస్తున్న సీఐ నాగరాజు

పెంచికల్‌పేట్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు అన్నారు. మండలంలోని కొండపల్లి గ్రామంలో ఆదివారం పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా నిరుపేదలకు దుప్పట్లు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో నాటుసార తయారు చేసినా, విక్రయించినా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. బడీడు పిల్లలను తప్పకుండా బడికి పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. యువత సమయం వృథా చేయకుండా చదువుతోపాటు ఆటల్లో రాణించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఆయన వెంట ఎస్సై విజయ్‌కుమార్, సర్పంచ్ ఉపాసీ సంజీవ్, మాజీ సర్పంచ్ ఎల్కరి సుధాకర్ ఉన్నారు.

ప్రమాదకర మూలమలుపులు

- సూచిక బోర్డులు, స్పీడ్‌బ్రేకర్లు కరువు
- పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు


వెంకట్రావ్‌పేట్ గ్రామసమీపంలో ప్రధాన రహదారిలోని ప్రమాదకర మూలమలుపు

సిర్పూర్(టి): మండలంలోని ప్రధాన రహదారులపై ఉన్న ప్రమాదకర మూలమలుపులతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సిర్పూర్(టి) -కౌటాల, సిర్పూర్(టి) -కాగజ్‌నగర్, సిర్పూర్(టి) -మాకిడి అంతర్రాష్ట్ర రహదారి, వెంకట్రావ్‌పేట్ -పోడ్సా అంతర్రాష్ట్ర ప్రధాన రహదారులపై ఉన్న ప్రమాదకర మూలమలుపులతో ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణాలు సాగిస్తున్నారు. ప్రమాదకర మూలమలుపులు, సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో మండలంలో రోజురోజుకు రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి.

సూచిక బోర్డులు లేవు..

మండలంలోని ప్రధాన రహదారుల్లో ప్రమాదకరంగా మూలమలుపులు ఉన్నా ఎలాంటి సూచిక బోర్డులు లేకపోవడం గమనార్హం. తరుచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారని మండలవాసులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి మూల మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

తరుచూ రోడ్డు ప్రమాదాలు



ప్రతీరోజు రద్దీగా ఉండే ప్రధాన రహదారుల్లో రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. దీంతో రోడ్డు ప్రమాదాల బారిన పడి మృత్యువాత పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలి.

–మాలోత్ వెంకటరమణ, సిర్పూర్(టి)

అధికారులు స్పందించాలి



ప్రధాన రహదారుల్లో ఎలాంటి సూచికల బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టకపోవడంతో రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అధికారులు స్పందించి రోడ్డు ప్రమాదాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలి.

– బి.వినోద్, చింతకుంట

దీక్షాపరుల ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు

కౌటాల: మండల కేంద్రంలోని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప నివాసంలో ఆదివారం మండలంలోని జంగుబాయి దీక్షాపరులు ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప దంపతులు జంగుబాయి దీక్షాపరులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని వీర్దండి గ్రామంలోని హనుమాన్ ఆలయంలో జెడ్పీ మాజీ చైర్మన్, బీఎస్పీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి జంగుబాయి దీక్షాపరులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే సతీమణి కోనేరు రమాదేవి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య, వీర్దండి సర్పంచ్ మడావి రేణుక, భక్తులు పాల్గొన్నారు.

రేపు భక్త మార్కండేయ జయంతి ఉత్సవాలు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని పెద్దవాగు సమీపంలో గల శ్రీ శివభక్త మార్కండేయ స్వామి ఆలయంలో ఈ నెల 24న భక్తమార్కండేయ స్వామి జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పద్మశాలి సేవా సంఘం నాయకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈసందర్భంగా ఉదయం ఆలయంలో గణపతి హోమం, ధ్వజారోహణము, హోమం, పూర్ణాహుతి, పల్లకీసేవ, శోభాయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 1.00 గంటలకు అన్నదానం నిర్వహిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

24 నుంచి క్రీడా పోటీలు

కెరమెరి: మండలంలోని అనార్‌పల్లి గ్రామంలో శ్రీ లక్ష్మీ పద్మావతి, వెంకటేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బాదావత్ ధన్‌రాజ్, ప్రకాశ్, జగదీశ్ ఒక ప్రకటనలో తెలిపారు. 24న కబడ్డీ, 27న వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు ధారావత్ ఉల్లాస్, నంబర్ 9848605156లో సంప్రదించాలన్నారు.

యజ్ఞంతో విఘ్నాలు తొలగిపోతాయి


యజ్ఞంలో పాల్గొన్న జెడ్పీ చైర్ పర్సన్ కోవ లక్ష్మి

కెరమెరి: ఇంట్లో యజ్ఞం నిర్వహించడంతో విఘ్నాలు తొలగిపోతాయని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. ఆదివారం జైనూర్ మండల కేంద్రంలోని జిల్లా గ్రంథాలయ చైర్మన్ కనక యాదోరావు నివాసంలో ఏర్పాటు చేసిన యజ్ఞంలో ఆమె పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. యాదోరావు దంపతులకు నుదిట తిలకం దిద్దారు. పెందోర్ రాంశావ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. హోమం నిర్వహించారు. ఆదివాసీలు తమ ఇళ్లల్లో పూజలు నిర్వహిస్తే దేవుడు కరుణిస్తాడని, సకల సుఖాలు కలుగుతాయని ఆమె పేర్కొన్నారు. జెడ్పీటీసీ సెడ్మకి దుర్పతబాయి, ఎంపీటీసీ భగవంత్‌రావు, సర్పంచ్‌లు మడావి భీంరావు, శ్యాంరావు, మారుతి, లక్ష్మణ్ ఉన్నారు.

గిరిజనుల అభివృద్ధికి కృషి

కాసిపేట: గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. మండలంలోని వెంకటాపూర్ పంచాయతీ కుర్రేఘాట్‌లో ఆదివారం కూపర్‌లింగుస్వామి జాతర రెండో రోజు నిర్వహించిన కార్యక్రమాలకు హాజరై దర్శనం చేసుకొని పూజలు చేశారు. ఆదివాసీ గిరిజనులు సాంప్రదాయ పద్ధతిలో ఘనంగా స్వాగతం పలికారు. కుర్రేఘాట్ రోడ్డు నిర్మాణానికి రూ.1.02 కోట్లు మంజూరుకు కృషి చేస్తానని, ఆలయం వద్ద రేకుల షెడ్, మరుగుదొడ్ల కోసం రూ.10 లక్షలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కోలాంగూడలో పది మంది గిరిజనులకు ఐటీడీఏ ద్వారా ఒక్కొక్కరికి రూ.3లక్షల చొప్పున మంజూరైన ఇళ్ల నిర్మాణాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. వెంకటాపూర్ పంచాయతీ తెలంగాణ క్రీడాప్రాంగణాన్ని ప్రారంభించారు. మల్కెపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ఆడ సోము ఇటీవల ప్రమాదంలో మృతి చెందగా ఇన్సూరెన్స్ చెక్కు రూ.2లక్షలు అందజేశారు. రొట్టపల్లి గ్రామానికి చెందిన పోగుల శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ ఇన్సూరెన్స్ చెక్కు రూ.2లక్షలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చంద్రయ్య, వైస్ ఎంపీపీ విక్రమ్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, సర్పంచ్‌లు సౌందర్య, జంగు, లక్ష్మి, తిరుపతిరెడ్డి, దుర్గం పోశం, హన్మంత్, మంజులరెడ్డి పాల్గొన్నారు.

ఆదివాసీ సంప్రదాయాలను కాపాడుదాం


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఆత్రం సక్కు


పూజలు చేస్తున్న జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు

ఆసిఫాబాద్‌రూరల్: ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలను మర్చిపోవద్దని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. ఆదివారం మండలంలోని వాడిలొద్ది గ్రామంలోని గుండ్రాయి భీమయ్యక్ దేవుడికి ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఆలయం అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కౌసల్య, బాదు పటేల్, ఆదివాసీ నాయకులు వినోద్, భక్తులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ పూజలు

ఆసిఫాబాద్‌రూరల్: తేనుగూడ గ్రామంలో ఆదివారం భీమయ్యక్ దేవుని వార్షికోత్సవం సందర్భంగా జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కబడ్డీ పోటీలు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్, సర్పంచ్ భీమేష్, బాపురావు, ఎంపీటీసీ రమేష్, నాయకులు మహేష్, తిరుపతి ఉన్నారు.

పంటలు ధ్వంసం

తాంసి: రైతులు సాగు చేసిన పంటలకు అడవిపందుల బెడద తప్పడం లేదు. శనగ పంటలపై దాడులు చేసి, పూర్తిగా ధ్వంసం చేస్తున్నాయి. తాంసి మండల కేంద్రానికి చెందిన కనపర్తి ప్రసాద్ సాగు చేసిన శనగ పంటను శనివారం రాత్రి అడవి పందులు ధ్వంసం చేశాయి. దాదాపు ఎకరానికి పైగా పంట నశనం అయింది. పెట్టిన పెట్టుబడి కూడా రాలేదని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. అధికారులు పంటను పరిశీలించి నష్టపరిహారం అందేలా చూడాలని రైతు కోరుతున్నాడు.

ఆటల్లోనూ.. 'ఆదర్శం'!

కెరమెరి: అంగన్‌వాడీ కేంద్రాలను ఆదర్శ కేంద్రాలుగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలకు 35 రకాల ఆట వస్తువులను మంజూరు చేసింది. విద్యార్థులకు ఆటపాటలతో విద్యాబోధన చేయాలనే ఉద్దేశంతో ఆట వస్తువులు అందజేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. మండలంలో మొత్తం 84 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, 30 కేంద్రాలను ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రాలుగా తీర్చిదిద్దారు. వాటిల్లో ఇప్పటికే 22 కేంద్రాలకు ఆట వస్తువులు పంపిణీ చేశారు.


పార్కులో ఆట వస్తువులతో ఆడుకుంటున్న చిన్నారులు


కొరారీలో మంజూరైన ఆట వస్తువులు


బోర్డుపై రాసిన అక్షరాలను చదివిస్తున్న టీచర్

ప్రభుత్వ పథకాలతో గ్రామాల అభివృద్ధి

తాంసి: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలతో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. ఆదివారం మండలంలోని సావర్గాంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయన్నారు. తాంసి, భీంపూర్ మండలాలలోని పలు గ్రామాలకు బీటీరోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భారత్, వైస్ ఎంపీపీ రఘు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ధనుంజయ్, పంచాయతీ రాజ్ ఏఈ శివరాం, సదానందం, బీఆర్ఎస్ కన్వీనర్ అరుణ్, శ్రీధర్ రెడ్డి, కేశవ్ రెడ్డి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.